హనుమాన్ చాలీసా పారాయణం

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ చాలీసా పారాయణంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ధర్మ ప్రచార సహాయ ప్రముఖ్ సుభాష్‌చంద్ర అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, న్యాయవాది నాగరాజు యాదవ్,భజరంగ్‌దళ్ జిల్లా నాయకులు మనోజ్ , బీజేపీ అసెంబ్లి కన్వీనర్ శ్రీనివాస్ గుప్త, బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం, భక్తులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్.. అధునాతన చికిత్స

శేరిలింగంపల్లి: గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్న 64 ఏళ్ల మహిళకు అధునాతన రేడియోథెరపీ, ఇంటర్‌స్టీషియల్ బ్రాకీథెరపీ చికిత్స చేశారు నల్లగండ్ల అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు. రేడియేషన్ అంకాలజిస్ట్, బ్రాకీథెరపీ స్పెషలిస్ట్ డాక్టర్ హర్‌జీత్ కౌర్‌బజ్వా ఆధ్వర్యంలో చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలోని మహిళల్లో 8.7 శాతం గర్భాశయ కేన్సర్ కేసులు కనిపిస్తున్నాయన్నారు. 2024లో దేశవ్యాప్తంగా చూస్తే తెలంగాణలో అత్యధికంగా నమోదయ్యాయని ముఖ్యంగా ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో ఈ కేసులు కనిపిస్తున్నాయన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడలకు వయసుతో పనిలేదని ఆడాలనే పట్టుదల ఉంటే చాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.లక్ష అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్టర్ అథ్లెటిక్స్‌లో 60ఏళ్ళు నిండిన సీనియర్ సిటిజన్‌లు క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. యువత సైతం క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అధ్యక్షులు ఇక్బాల్ తదితరులున్నారు.

ఫుట్ 'స్పాట్'

యథేచ్ఛగా ఆక్రమణలు / పట్టించుకోని అధికారులు

ఐటీ కారిడార్‌లో పాదచారులకు తప్పని ఇబ్బందులు


గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ హోటల్ ఎదుట ఫుట్‌పాత్‌పై బైక్‌ల పార్కింగ్

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో ప్రతి యేటా కోట్ల రూపాయలతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. నిత్యం భారీగా ట్రాఫిక్ ఉండే రోడ్లపై నడక కత్తిమీద సాములాంటిదే. ఒక్కోసారి ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాదచారుల రక్షణ కోసం జీహెచ్ఎంసీ ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతోంది. ఒక్కోచోట లక్షలు వెచ్చించి ఫుట్‌పాత్‌లు నిర్మించినా ఫలితం లేకుండా పోతోంది. వీధి వ్యాపారులు యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపార అడ్డాలుగా మార్చుకోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టిన జీహెచ్ఎంసీ ఆక్రమణలపై ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. హోటల్స్, పూలబండ్లు, నర్సరీలు, బైక్‌ల పార్కింగ్, పండ్ల వ్యాపారులు, టీ స్టాల్స్


హఫీజ్‌పేట్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కొండాపూర్ వైపు వచ్చే రోడ్డులో నర్సరీ

ఇలా ఫుట్‌పాత్‌లపై చేరిపోయారు. దీంతో నడిచేందుకు దారి లేదని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగిస్తే పాదచారులకు సౌకర్యం కలుగుతుంది.


ఫుట్‌పాత్‌పై పూల వ్యాపారం

ట్రాఫిక్ సమస్య

వీధి వ్యాపారాల మూలంగా అక్కడికి వచ్చే వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఫుట్‌పాత్‌లను ఆవాసాలుగా చేసుకున్న వ్యాపారులను మరో చోటికి తరలించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ అంతరాయంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులపై ఉంది. వీధి వ్యాపారుల తరలింపుపై ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కొనసాగుతోంది.

ఆక్రమణలు.. చర్యలు ఏవి?

ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉదాసీనంగా వదిలేయడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇక ఏకంగా కొందరు ఫుట్‌పాత్‌లపై అద్దె సైతం వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ట్రిపుల్ ఐటీ నుంచి గచ్చిబౌలి క్రాస్ రోడ్డు వరకు నిత్యం రోడ్డు బిజీ బిజీగా ఉంటుంది. సంధ్య కన్వెన్షన్ సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఓ హోటల్ ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్మించిన ఫుట్‌పాత్‌ను బైక్ పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్నారు.
- గచ్చిబౌలి నుంచి ట్రిపుల్ ఐటీ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఫ్లైఓవర్ చివర్లో కొద్ది రోజుల క్రితం ఫుట్‌పాత్ నిర్మించారు. దీనిపై పూల వ్యాపారం చేస్తున్నారు
- జీపీఆర్ఏ క్వార్టర్స్ నుంచి ఇందిరానగర్ ప్రధాన రహదారి మూలమలుపు వద్ద ఫుట్‌పాత్‌పై కొబ్బరి బొండాలు, కుట్టుమిషన్లు, ఇతర వ్యాపారులు తిష్ట వేశారు. అక్కడికి వచ్చే వారు వాహనాలను నిలిపితే ప్రధాన రహదారి పైకి వెళ్లడం ఇబ్బంది.
- కొండాపూర్‌లోని మాధవహిల్స్ నుంచి హఫీజ్‌పేట్ రైల్వే అండర్‌బ్రిడ్జి వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి హోటల్స్, పండ్ల దుకాణాలు, ఇతర వ్యాపారులు తిష్ట వేశారు. సాయంత్రం సమయంలో వీధి వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ జాం నెలకొంటోంది.
- మైహోం మంగళ రోడ్డులో హఫీజ్‌పేట్ నుంచి హైటెక్స్‌కు వెళ్లే దారితో ఫుట్‌పాత్‌పై నర్సరీ వెలిసింది. ఫుట్‌పాత్‌పై మట్టి పోసి మరీ మొక్కలు అమ్మకానికి ఉంచారు.


గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌కు వెళ్లే రోడ్డులో..






మై హోం మంగళ రోడ్డులో..

సందడిగా కార్తీక వన భోజనాలు

గచ్చిబౌలి: కార్తీకమాసం సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. ఆదివారం బొటానికల్ గార్డెన్‌లో కొండాపూర్ కమ్మసంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కమ్మ సంఘం సభ్యులంతా ఐక్యంగా ఉండాలన్నారు. అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేటర్ మొవ్వా విజయ్‌బాబు, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్‌తోపాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ డిపోలో..

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అన్ని డిపోలలో ఏర్పాటు చేశారని తెలిపారు. ఉద్యోగులంతా కలిసి మెలిసి పనిచేసే వాతావరణం నెలకొల్పేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు.

మియాపూర్ డివిజన్‌లో..



చందానగర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద మయూరినగర్, దోవ కాలనీల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు.

కొండాపూర్ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

రాయదుర్గం: దీక్షా దివస్‌ను పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ పిలుపుపై కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో ఆ పార్టీ శేరిలింగంపల్లి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లావుద్దీన్, బాబుమియా, కిరణ్‌యాదవ్, అంజమ్మ, అశోక్‌యాదవ్, జగదీష్, నారాయణ, రమేష్‌గౌడ్, అనిల్‌సింగ్, మక్బూల్, ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పాదాల కోసం ప్రత్యేక ఆస్పత్రి

గచ్చిబౌలి: భారతదేశంలో మధుమేహ పాదాల వ్యాధి(డీఎస్‌డీ) తీవ్ర ఆరోగ్య సమస్యగా మారిందని కిమ్స్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. దేశంలో తొలిసారి పాదాలకు ప్రత్యేక ఆస్పత్రిని కిమ్స్ ఆస్పత్రులు, డాక్టర్ నరేంద్రనాథ్ మేడా సంయుక్త ఆధ్వర్యంలో 'ద ఫుట్ డాక్టర్' పేరిట ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా మధుమేహం కారణంగా దాదాపు లక్ష మందికి పైగా పాదాలు తొలగించాల్సి వస్తోందన్నారు. అనంతరం డాక్టర్ నరేంద్రనాథ్ మేడా మాట్లాడుతూ దేశంలో పాదాల చికిత్సకు ప్రత్యేక వైద్యం అవసరం అని అన్నారు. వ్యాధిపై అవగాహన లేకపోవడం, చికిత్సల్లో ఆలస్యం కావడంతో అవయవాల తొలగింపు లాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం: గుల్‌మోహర్ పార్కు కాలనీ డబుల్ ఇళ్లవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీవాసులు ఆదివారం ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ డబుల్ ఇళ్లలో నివాసముండే వారికి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



చందానగర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎంఆర్ హైల్యాండ్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ట్రెజరర్ పిచ్చయ్య, గౌరవ అధ్యక్షులు మల్లారెడ్డి, సదానంద్, ఉపాధ్యక్షులు నవీన్, కార్యదర్శి శోభ, సుగుణ, బాల్‌రాజ్, రాజేష్, పాండ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

చందానగర్: చిన్నారులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లోని లిటిల్ బుడ్డి ప్రీస్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ స్వామి విద్యాసాగర్, సింగం ప్రమీల, స్రవంతి, వీణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిజం పబ్‌లో అగ్ని ప్రమాదం

గచ్చిబౌలి: వీక్‌తో పాటు వీకెండ్‌లోనూ రష్‌గా ఉండే ప్రిజం పబ్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కిచెన్‌లో ఒక్కసారిగా మంటలు రేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో అక్కడున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. పబ్‌లో ఉన్న వారిని బయటకు తరలించారు. సమాచారం అందుకున్న వట్టినాగులపల్లి అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు మంటలు ఆర్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గచ్చిబౌలి పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాదాపు నాలుగు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

సిటీ బస్సుల్లో చోరీలు.. ముఠా అరెస్ట్

- 30 కేసుల్లో నిందితులు
- వివరాలను వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్



గచ్చిబౌలి: సిటీ బస్సులో ప్రయాణికుల కళ్లుగప్పి చోరీలకు పాల్పడుతున్న ముఠాను ఎస్ఓటీ, ఆర్సీపురం పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ కేసు వివరాలను వెల్లడించారు. మల్లెపల్లి మంగర్‌బస్తీకి చెందిన షూ పాలిష్ చేసే ఉపాడి బోలేనాథ్ అలియాస్ బోలానాథ్(42), ఆటో డ్రైవర్ అబ్దుల్ మన్నన్(29), మహ్మద్ ఖదీర్(26)కూలీ కంబ్లే సికందర్ అలియాస్ మోటు(50), ఆటోడ్రైవర్ ఉప్పాడ సునీల్(34)లు కలిసి సిటీ బస్సులో ఫుట్ బోర్డ్ ప్రయాణం చేస్తూ ప్రయాణికుల కళ్లు గప్పి సెల్ ఫోన్లు, బంగారు గొలుసులు చోరీ చేస్తున్నారు. నవంబర్ 25న సాయంత్రం 5 గంటల సమయంలో అనిశెట్టి శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి సికింద్రాబాద్ నుంచి బాలానగర్‌కు వస్తుండగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ వద్ద బస్సు ఎక్కిన కొందరు వ్యక్తులు మెడలోని బంగారు గొలుసు కొట్టేశారని ఆర్సీపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు బోలానాథ్, మన్నన్, సికందర్, సునీల్‌ను అరెస్ట్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో 30 చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారని డీసీపీ తెలిపారు. బోలానాథ్ 30, మహ్మద్ ఖదీర్ 25, మన్నన్ 4, మోటు9, సునీల్ 3 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. ఆర్సీపురం పీఎస్‌లో 3, మియాపూర్ పీఎస్‌లో 9, రాయదుర్గం పీఎస్‌లో 5, హుమాయూన్‌నగర్ పీఎస్‌లో 4, చందానగర్ పీఎస్‌లో 3, కేపీహెచ్‌బీ పీఎస్‌లో2, ఫిల్మ్‌నగర్ పీఎస్‌లో 2, మాదాపూర్, బంజారాహిల్స్ పీఎస్‌లలో ఒక్కో కేసు నమోదైంది. సికందర్ అలియాస్ హీరా, మక్కన్ కసబ్‌లు పరారీలో ఉన్నారు. నిందితులు మూడేళ్లుగా చోరీలకు పాల్పడుతున్నారని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీసీపీ వినీత్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీలు శ్రీకాంత్, నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సన్మానం



శేరిలింగంపల్లి: సురభి కళాకారుల సంక్షేమ సంఘం నూతన అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురభి కాలనీవాసులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్ఏ చంద్రశేఖర్, జయకృష్ణ, వెంకటబాను, జితేందర్‌రెడ్డి, సుధ, సుబ్బారావు, కోదండరావు, రమణకుమార్ పాల్గొన్నారు.

ఒడిశా టు చందానగర్.. 57 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుబడ్డ నిందితులు.. గంజాయి ప్యాకెట్లు

- ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ
- ముందు పైలెటింగ్‌తో కారుకు క్లియరెన్స్
- చెక్‌పోస్టులు దాటుకుంటూ చందానగర్‌కు చేరిన గంజాయి

గచ్చిబౌలి: ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ముఠాను ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. హర్యాణ దివాని జిల్లాకు చెందిన చరణ్ పల్సర్ బైక్‌పై ఒడిశా నుంచి కారులో ఉన్నవారికి పైలెటింగ్ చేస్తూ చందానగర్‌కు వచ్చారు. కారులో బోయినపల్లికి చెందిన శివంపేట్ ఉమాకాంత్ అలియాస్ చిన్ను, అర్జున సాయి, కృష్ణ ఉన్నారు. కారులో బ్యానెట్, డిక్కీతో పాటు, డోర్లలో స్పీకర్లు ఉండే చోట గంజాయి ప్యాకెట్లను అమర్చారు. ముందు పైలెటింగ్ ఉండటంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా హైదరాబాద్‌కు చేరుకున్నారు. కారులో గంజాయి ఉందన్న సమాచారంతో శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఎస్ఓటీ, చందానగర్ పోలీసులు పట్టుకున్నారు. కారులో 57 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ కేంద్రంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు గంజాయి సరఫరా చేసేందుకు తెచ్చారని పోలీసులు తెలిపారు. హర్యాణాకు చెందిన మరో వ్యక్తి రాకేష్ పరారీలో ఉన్నాడు. ఒడిశా నుంచి వివిధ రాష్ట్రాలకు హర్యాణాకు చెందిన వారు గంజాయి సరఫరా చేస్తారని ఈ క్రమంలోనే తెలంగాణకు గంజాయి సరఫరా చేసేందుకు చరణ్, రాకేష్‌లు కీలకంగా వ్యవహరిస్తున్నారని డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ.18 లక్షల విలువైన గంజాయి, మహీంద్ర కారు, మూడు సెల్‌ఫోన్లు, పల్సర్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాం, ఏసీపీలు శ్రీకాంత్, నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా అంజిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా శాంతినగర్‌కు చెందిన కొండకల్ అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని హనుమాన్ ఆలయంలో జరిగిన సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీల పెద్దల సమక్షంలో అంజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ... శాంతినగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీలలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు రాజిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, విజయ్, న్యాయవాది నరసింహ, వినోద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నాయకులు దశరథ్ రెడ్డి, పోచారం కిష్టయ్యలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పటాన్‌చెరు: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా అమీన్‌పూర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ బీరంగూడలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదివారం అమీన్‌పూర్ మండల ఎంఈఓ సుధాకర్ ఆధ్వర్యంలో 'పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి.6వ తరగతి నుండి పదో తరగతి వరకు 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి ,ద్వితీయ ,తృతీయ వరుసగా ఎస్ కే వి శర్మ ,ఎన్ లోకేష్, ఆదర్శ్ (ఇంగ్లిష్ మీడియం) బహుమతులను గెలుచుకున్నారు. తెలుగు మీడియం విద్యార్థుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అమల, కృష్ణప్రియ, ఎస్ లోకేష్ నిలిచారు.అలాగే జూనియర్ విభాగంలో రూబేన్(ప్రథమ) ,ఎస్ అనన్య(ద్వితీయ) ,జి సంధ్య(తృతీయ) స్థానాల్లో నిలిచారు. హిందీ విభాగంలో ఎస్ ముస్కాన్ బహుమతి గెలుచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసంత, ఉపాధ్యాయులు స్వరూప, ఇంద్రారెడ్డి, పద్మజ్యోతి, బస్సిబాబు, మునయ్య పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజ, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గురుస్వాములు నర్ర బిక్షపతి, సంజీవరెడ్డి, సుధాకర్, ఎండీఆర్ ఫౌండేషన్ కో ఫౌండర్ పృధ్వీరాజ్, ధ్యక్షుడు మధు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి వినతి

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ కాలనీలలోని శ్రీ హరిశ్చంద్ర హిందూ శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రహరీగోడ, మంచి నీటి బోరు, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, వెంకటేశ్వరరావు, ఖాదర్, పాపారావు,యాదగిరి, దామోదర్, మహేందర్ రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ కాలనీవాసులు

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల సొంత నిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ సాయి యాక్సిస్ హోమ్స్ కాలనీలో 60 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మండల పరిధిలోని గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడం మూలంగా పెద్ద ఎత్తున నిధులు మంజూరై అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. కాగా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే 10 లక్షల రూపాయలు సొంత నిధులను అందజేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో నాగాలాండ్ ఫౌండేషన్ డే

గవర్నర్‌ను కలిసిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు

రాయదుర్గం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నాయకత్వంలో రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన నాగాలాండ్ ఫౌండేషన్ డే కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి నాగాలాండ్‌కు చెందిన విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు తరలివెళ్లారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఏక్‌భారత్– శ్రేష్ఠభారత్ (ఈబీఎస్‌బీ) పేరిట కేంద్ర ప్రభుత్వం, రాజ్‌భవన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హెచ్‌సీయూ ఈబీఎస్‌బీ కోఆర్డినేటర్ డాక్టర్ వి వంశీకృష్ణారెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ వేనుసాటి నియా, డాక్టర్ అలిబాట, డాక్టర్ లిమాకుం బావాల్లింగ, డాక్టర్ రెలో కెన్యే, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, విద్యార్థులు, ఫ్యాకల్టీ